క్లుప్తంగా

అన్నారెడ్డిపాళెంలో వైద్యశిబిరం



వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బిందుమీనన్

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజలకు మూర్ఛవ్యాధి, పక్షవాతంపై అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన పలువురు బిందుమీనన్‌ను సత్కరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కావలి: మెగా లోక్ అదాలత్‌ను ఈ నెల 29న కావలి న్యాయస్థానాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేపథ్యంలో కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్ కేసులు ఖర్చు, కాలయాపన లేని, అప్పీల్ లేని అంతిమతీర్పులను లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా నిరుపేదలకు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు ఇస్తారని తెలిపారు. ఈ మెగా లోక్ అదాలత్‌ను జలదంకి, కొండాపురం , కలిగిరి, కావలి, బోగోలు మండలాల కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రీ స్కూల్ సర్టిఫికెట్ల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులతో అంగన్‌వాడీ సిబ్బంది

అల్లూరు: మండల పరిధిలోని మోపూర్ పంచాయతీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం ప్రీ స్కూల్ పిల్లలు 8 మందికి ప్రీ స్కూల్ సర్టిఫికెట్స్ ఇచ్చి ప్రాథమిక పాఠశాలలో చేర్పినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.రాజేశ్వరి తెలిపారు. మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పరిశీలన



తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం: స్థానిక బెస్తకాలనీలో ఉన్న తాగునీటి పథకాన్ని ఆదివారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి పరిశీలించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి రక్షిత నీటి పథకాలను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రపరచాలన్నారు. తాగునీరు కలుషిత ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



కావలి: విశ్వోదయ బహుళ విద్యాసంస్థల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, విశ్వోదయ ఇంజినీరింగ్ కాలేజీ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం 60 మంది నిరుపేద వృద్ధులకు సుమారు రూ.60 వేల విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు, కొంత నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వోదయ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

జలదంకి: మండలంలోని జలదంకి, చామదల గ్రామాల్లో ఉన్న పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పంట మార్పిడి లాభదాయకం

- ఒకే రకమైన పంటల సాగుతో తగ్గుతున్న దిగుబడులు
- పంటల మార్పిడితో భూసారం పెరుగుదల

కలిగిరి: పంట మార్పిడి ప్రయోగాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. భూమిలో ఒకే పంటను వరుసగా సాగు చేస్తుడడం వల్ల భూసారం తగ్గి తెగుళ్ల ఆశించి దిగుబడులు బాగా తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పంట మార్పిడి చేస్తే అన్నదాతలు ఆశించిన ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఒకే రకమైన పంటలు కాకుండా క్రమ పద్ధతిలో ఇతర పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు. పంట మార్పిడి విధానం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని పేర్కొంటున్నారు. సాగు పెట్టుబడులు కూడా తగ్గుతాయి. ప్రస్తుతం పంటల సాగు సీజన్ మొదలు కావడంతో పంట మార్పిడిపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఒకే రకం పంటల సాగుతో నష్టం

భూమిలో ఒకే రకమైన పంటలు వేయడం ద్వారా భూసారం తగ్గి రైతులు ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించలేరు. చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. దిగుబడి అయిన పంటలో నాణ్యత తక్కువగా ఉంటుంది. పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పంట మార్పిడి చేయకపోవడంతో నేల కోతకు గురవుతుంది.

పంట మార్పిడితో భూసారం వృద్ధి

వరిపంట సాగు చేసే పొలాల్లో పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం ద్వారా భూసారం పెరుగుతుంది. తర్వాత పంట ఏపుగా పెరిగి దిగుబడులు కూడా అధికంగా వస్తాయి. వరి సాగు అనంతరం ఆ పొలాల్లో అపరాలు సాగు చేస్తే సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. పంటలను ఆశించే తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది. వరి అనంతరం గింజ జాతి విత్తనాలు అయిన పెసర, శనగ, మినుము, వేరుశనగ వంటి పంటలు సాగు చేయడం ద్వారా భూమికి మంచి సారాన్ని ఇస్తాయి. తర్వాత వరి పంటను మరలా సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చు.



పచ్చిశనగ పంట



సాగులో ఉన్న వరిపంట

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



పంట మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. భూమిలో తరచూ ఒకే రకమైన పంటలను వేయడంతో సరైన పోషకాలు అందక దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. పంట మార్పిడి పద్ధతులను రైతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలి.

– ఎం.సురేష్‌బాబు, వ్యవసాయాధికారి, కలిగిరి

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న మేకపాటి రాజారెడ్డి



హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మేకపాటి రాజారెడ్డి భరోసా

ఉదయగిరి: 'అధికారంలోకి వచ్చామనే అహంకారంతో టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో విచ్చలవిడిగా వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి చేయడం హేయమైన చర్య.. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దు.. మేము అండగా ఉంటాం'.. అంటూ వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఉన్న మేకపాటి రాజారెడ్డి నివాసంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలు ఎవరి జోలికి వెళ్లరని, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడితే సహించబోమని హెచ్చరించారు. ప్రజలు టీడీపీకి అధికారం ఇచ్చింది అభివృద్ధి చేయమనే కానీ.. అరాచకంగా దాడులు చేయమని కాదని ఆయన ఘాటుగా చురకలంటించారు.

అన్నివర్గాల ప్రజలకు మేలు చేశాం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు చేశారని రాజారెడ్డి గుర్తుచేశారు. సార్వత్రిక ఎన్నికల్లో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై ఎక్కడ దాడులు జరిగినా, బెదిరింపులకు దిగినా సహించబోమన్నారు. జిల్లాలో ఏడు నియోజవర్గాల ఇన్‌చార్జిలు ప్రతి నెలా ఒక మండలంలో సమావేశమై పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. 2029 ఎన్నికల్లో మరలా జగనన్న సీఎం కావడం ఖాయమని తెలిపారు. టీడీపీ కూటమి హామీలు సగం కూడా అమలు చేసే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో అన్ని మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవస్థ మార్పు కోసం పోరాటాలు



మాట్లాడుతున్న కందారపు మురళి

ఆత్మకూరురూరల్: కార్మిక, కర్షక వర్గాల ప్రయోజనాలు నెరవేరేలా వ్యవస్థలో మార్పు కోసం సీఐటీయూ పోరాటాలు చేస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి పేర్కొన్నారు. పట్టణంలోని చెర్లో రమణారెడ్డి భవన్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సీఐటీయూ శిక్షణ తరగతులు ముగింపు సమావేశానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తమ యూనియన్ కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జీవీ శివప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, సీఐటీయూ అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటా లక్ష్మీపతి, సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, నాయకులు ఆళ్ల హజరత్తయ్య, నందా శ్రీను, గుల్జార్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వరదరాజస్వామి గ్రామోత్సవం



గజవాహనంపై ఆశీనులైన వరదరాజస్వామి

అల్లూరు: మండల పరిధిలోని నార్త్ మోపూరు గ్రామంలో శ్రీవరదరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. గ్రామోత్సవంలో స్వామివారు గజవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



కావలి: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి తన కుటుంబసభ్యులతో తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకుని తిరిగి విజయవాడకు వెళుతూ కావలిలోని పోలీస్ అతిథిగృహానికి విచ్చేశారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

కావలి: పట్టణంలోని తుఫాన్‌నగర్‌కు చెందిన క్యాన్సర్ బాధితుడు ఎస్.వెంకటశేషయ్యకు వైద్యఖర్చుల నిమిత్తం సంయుక్త సేవాసంస్థ సభ్యులు ఆదివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో సభ్యులు బాధితుని ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రసాద్‌రావు, శాసం హరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఆడిట్

సోమశిల: అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఏపీఓ దయాసాగర్ ఆధ్వర్యంలో మండలంలోని 25 పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. 25 పంచాయతీల్లో 2023–24 సంవత్సరంలో జరిగిన పనులకు గాను రూ.12,42,88,000 ప్రజలకు అందాయని తెలిపారు. ఇందుకోసం ప్రతి పంచాయతీలో గ్రామసభ ఏర్పాటు చేసి పనులు పూర్తిస్థాయిలో జరిగాయా.. లేదా.. విచారణ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరురూరల్: నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన శ్యామాప్రసాద్ ముఖర్జీ చిరస్మరణీయులని బీజేపీ ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి అన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఆత్మకూరు రూరల్ అధ్యక్షుడు వాసిపల్లి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య, మర్రిపాడు మండల కార్యదర్శి సడ్డా రమేష్‌రెడ్డి, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు గడ్డం వెంకటేశ్వర్‌రెడ్డి, నలిశెట్టి శ్రీనివాసులు, సుమంత్‌రెడ్డి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



ఎం.అశోక్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ జరుగుతోందని, విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజుల దోపిడీని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆత్మకూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుస్తకాలు, యూనిఫాం పేరుతో తమ విద్యాసంస్థల్లోనే వ్యాపారం చేస్తున్నాయని, తల్లిదండ్రుల నుంచి ఇష్టానుసారం సొమ్ము వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ దోపిడీకి విద్యాశాఖ అధికారులు అడ్డుకట్టవేయకపోతే ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో త్వరలోనే ధర్నా చేస్తామని తెలిపారు.

పీఎం మోదీ రాజీనామా చేయాలి

నెల్లూరు (టౌన్) : నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజీనామా చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటరాజు, తిరుమలయ్య ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 23న జరగాల్సిన నీట్ పీజీ పరీక్షను అర్ధాంతరంగా వాయిదా వేశారన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్న ప్రధాని మోదీ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా కోటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం: మండలంలోని దువ్వూరు గ్రామంలో ఉన్న గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామిని పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుతీర్చి పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కావలి: ఎస్‌బీఐ కావలి బ్రాంచ్ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించడంతోపాటు సేవా కార్యక్రమాల్లో ముందుంటారని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ నాయకుడు తారకనాథ్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ 104 మంది ఎస్‌బీఐ అధికారులు, సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అధికారులు గోర్ల శివకుమార్, వీవీ ప్రసాద్, సనత్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి, భువనేశ్వరి, జ్యోత్స్న, నరేంద్ర, మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో ఆలయానికి వస్తున్న ఆలయ ధర్మకర్తలు, అర్చకులు

ఘనంగా వెంగమాంబ అమ్మవారి నిలుపు



అమ్మవారికి పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ గ్రామంలో ఆదివారం శ్రీవెంగమాంబ పేరంటాలు వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు వెంగమాంబ అమ్మవారి నిలుపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు, అధికారులు, అర్చకులు కలశాలలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు వెంగమాంబ అమ్మవారిని దర్శించుకుని పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



నెల్లూరు (బృందావనం) : జ్యేష్ట పౌర్ణమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పడారుపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ నగర అధ్యక్షుడు సూరమౌళి మాట్లాడుతూ జ్యేష్ట పౌర్ణమి విశిష్టతను వివరిస్తూ ప్రచారం చేశామన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి ప్రజలకు తెలియజేశామన్నారు. ధర్మస్థాపనే త్రైత సిద్ధాంత ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సభ్యులు కోటేశ్వరరావు, విజయమ్మ, మోహన, నాగార్జున, వేణు, ప్రవీణ, సుమలత తదితరులు పాల్గొన్నారు.